# రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

- 'నో హెల్మెట్ – నో ఎంట్రీ' బ్యానర్లు ఏర్పాటు చేయండి
- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

**కర్నూలు (సెంట్రల్):** రహదారి ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో డిస్ట్రిక్ట్ రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడం, వాహనాలను ఓవర్‌టేక్ చేయడం, హెల్మెట్ ధరించకపోవడం వంటి కారణాలతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. రహదారి నియమాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని, వాహనదారులు హెల్మెట్ ధరించేలా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ముందుగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల పరిసరాల్లో తప్పనిసరిగా హెల్మెట్ వాడేలా 'నో హెల్మెట్ – నో ఎంట్రీ' అనే బ్యానర్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

➤ ఎల్లమ్మ తల్లి గుడి దగ్గర బ్రిడ్జి వర్క్ పూర్తి చేశారని, బ్రిడ్జి అప్రోచ్ రోడ్డుకు సంబంధించి నేషనల్ హైవే అధికారులతో సమీక్ష నిర్వహించుకుని త్వరితగతిన భూసేకరణను పూర్తి చేయాలని కలెక్టర్ కర్నూలు ఆర్‌డీఓను ఆదేశించారు.

➤ కిడ్స్ వరల్డ్ నుంచి రాజ్‌విహార్ సర్కిల్ వరకు ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను వచ్చే సమావేశం నాటికి సమర్పించాలని కలెక్టర్ కర్నూలు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌ను ఆదేశించారు.

➤ పెద్దపాడు నుంచి హైదరాబాదుకు ఎన్‌హెచ్‌కు లింక్ చేస్తూ ఔటర్ రింగ్ రోడ్ ఏర్పాటుకు సంబంధించి ఎన్‌హెచ్, ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ శాఖల అధికారుల సంయుక్త పరిశీలన నివేదిక అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు.

➤ ప్రభుత్వ సర్వజన వైద్యశాల బయట ట్రాఫిక్ రద్దీ తగ్గించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌ను ఆదేశించారు.

➤ నగరంలో 156 సీసీ కెమెరాలకు గాను 135 కెమెరాలను ఇన్‌స్టాల్ చేశారని, మరో 21 సీసీ కెమెరాలకు సంబంధించిన లొకేషన్లలో కూడా ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మున్సిపల్ అదనపు కమిషనర్‌ను ఆదేశించారు.

➤ హిట్ అండ్ రన్ కేసులకు సంబంధించి నష్టపరిహారం మంజూరు పెండింగ్‌లో లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీటీసీ, కర్నూలు ఆర్‌డీఓను ఆదేశించారు.

➤ ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ ప్రజలు హెల్మెట్‌ను ఉపయోగించేలా అవగాహన కల్పించడంలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో, పెట్రోల్ షాపులలో నో హెల్మెట్ – నో ఎంట్రీ అని బ్యానర్లను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల నుంచి హైవేకి కనెక్ట్ అయ్యే అప్రోచ్ రోడ్ల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఎక్కడ ఏర్పాటు చేయాలనే వివరాలు ఇచ్చామని, ఆ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, కర్నూలు ఆర్డీఓ సందీప్‌కుమార్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్ఈ రామచంద్రారెడ్డి, డీటీసీ శాంతకుమారి, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ ఏఓ సింధు సుబ్రహ్మణ్యం, నేషనల్ హైవే పీడీలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా, చిత్రంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్

### 15 శాతం వృద్ధి రేటు సాధించేలా ప్రణాళికలు

జిల్లాలోని అన్ని శాఖలు తమ లక్ష్యాలను అధిగమించి 15 శాతం వృద్ధి రేటు సాధించేలా ప్రణాళికలు వేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో రాత్రి 7.30 గంటలకు ఆయన వివిధ శాఖల అభివృద్ధి, ప్రగతి నివేదికలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ, ఉద్యాన, గనులు విద్యుత్, మత్స్య, అటవీ, పరిశ్రమల శాఖలు వృద్ధి రేటులో అత్యుత్తమ ప్రాధాన్యతను కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సీపీఓ హిమ ప్రభాకర్ రాజు పాల్గొన్నారు.

### బాల ఆధార్ నమోదును పూర్తి చేయాలి

0–5 సంవత్సరాల లోపు పిల్లల ఆధార్ వివరాల నమోదును పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా చిన్నపిల్లల ఆధార్ నమోదులో వెనుకబడి ఉందని, దానిని అధిగమించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 106 ఆధార్ కేంద్రాలు ఉన్నాయని, ఒక్కో దానిలో కనీసం 20 చొప్పున ఎన్‌రోల్‌మెంట్ చేయించాలని జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, ఐసీడీఎస్ పీడీ నిర్మలను ఆదేశించారు. 5 ఏళ్ల తర్వాత ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని, 15–17 సంవత్సరాల మధ్య కూడా మరోసారి ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవాలని, ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు.

## పార్కు స్థలాల్లో హెచ్చరిక బోర్డులు

**కర్నూలు (టౌన్):** నగరపాలక సంస్థ పరిధిలో పార్కు స్థలాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. నగరంలో నగరపాలక సంస్థకు చెందిన స్థలాలను గుర్తించి వాటిని సంరక్షించడంలో భాగంగా అయా ప్రాంతాల్లో బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్లు నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం సీటీ ప్లానర్ ప్రదీప్ కుమార్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగవ తరగతి ఉద్యోగుల కాలనీలో ఎల్‌పీ నంబర్ 116/89లో బోర్డులను ఏర్పాటు చేశామన్నారు. పార్కు స్థలాలను ఎవరైన అన్యాక్రాంతం చేయాలని చూస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.



హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

## బీసీ కుల వృత్తులకు ఆధునిక పరికరాలు

- బీసీ కార్పొరేషన్ ఈడీ ఎస్ జాకీర్‌హుసేన్

**కర్నూలు(అర్బన్):** వెనుకబడిన తరగతుల ఆర్థిక సేవా సహకార సంస్థ ఆధ్వర్యంలో కుల వృత్తిపై ఆధారపడిన బీసీ కులాలకు త్వరలో ఆదరణ –3 పథకం కింద ఆధునిక పరికరాలు అందించనుందని బీసీ కార్పొరేషన్ ఈడీ ఎస్ జాకీర్‌హుసేన్ తెలిపారు. మంగళవారం స్థానిక సంక్షేమభవన్‌లోని బీసీ కార్పొరేషన్ కార్యాలయ ఆవరణ –3 పథకం అమలుకు సంబంధించి బీసీ కులాలకు చెందిన కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, పలు బీసీ కుల సంఘాల నేతలతో సమావేశం నిర్వహించి సలహాలు, సూచనలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడుతూ జిల్లాలోని కుల వృత్తులకు సంబంధించి ఎలాంటి ఆధునిక పరికరాలు అందించాలనే విషయంపై అందిన సమాచారాన్ని తమ శాఖ ప్రధాన కార్యాలయానికి తెలియజేస్తామన్నారు. సమావేశంలో కురువ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు కే రామక్రిష్ణ, వలసల రామకృష్ణ, మురళీనాయుడు, విజయ్‌కుమార్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## అరబిక్ పాఠశాలను 'కార్పొరేట్'కు అప్పగించొద్దు

**కర్నూలు కల్చరల్:** వందేళ్ల చరిత్ర ఉన్న ఉమర్ అరబిక్ ఉన్నత పాఠశాలను కార్పొరేట్ విద్యా సంస్థకు అప్పగించాలని ప్రయత్నించడం తగదని ఉమర్ అరబిక్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు రిజ్వాన్, డాక్టర్ హమీదీ, ముస్లిం మైనార్టీ ఆర్గనైజేషన్ (సలీమ్ అలీ ఖాన్, షేక్ ఇమ్రాన్, ముస్తాక్, యాసర్) అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు మాట్లాడారు. అంజుమన్ కమిటీ, వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఈ పాఠశాలను ఓ ప్రైవేట్ పాఠశాలకు అప్పగించడాన్ని అడ్డుకుంటామన్నారు. పేద బడుగు బలహీన వర్గాల మైనార్టీ పిల్లలు చదువుకు అంజుమన్ కమిటీ అడ్డుపడటం అన్యాయమన్నారు. సమావేశంలో ఆవాజ్ కమిటీ ఇక్బాల్, షరీఫ్, మాసుమ్, షోయబ్, ఆమేర్, బీడబ్ల్యు రాజు, ఎన్ఎస్‌యూ మహేష్, ఏఐటీపీ చాంద్ బాషా, ఎస్ఎఫ్ఐ ఉదయ్, అబూబకర్, పృధ్వీ, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

### ఎయిడెడ్‌గానే కొనసాగించాలి

**కర్నూలు(సెంట్రల్):** నగరంలోని ఉమర్ అరబిక్ పాఠశాలను ఎయిడెడ్ పాఠశాలగానే కొనసాగించాలని ఆవాజ్, ఎస్ఎఫ్ఐ నగర కమిటీల అధ్యక్ష, కార్యదర్శులు ఇక్బాల్, షరీఫ్, అబుబకర్, సాయి ఉదయ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆవాజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన ఉమర్ అరబిక్ పాఠశాలను ప్రైవేటీకరణ చేసే ఆలోచనను విరమించుకోవాలన్నారు. పేద ముస్లిం మైనార్టీ పిల్లల చదువు కోసం ఆనాడు అబ్దుల్‌హక్ తన సొంత స్థలాన్ని పాఠశాలకు ఇచ్చారన్నారు. నేటి పాలకులు దానిని ప్రైవేటీకరణ చేసి నారాయణ గ్రూప్ ఆఫ్ స్కూళ్లకు అప్పగించే ప్రయత్నాలు చేయడం తగదన్నారు.




మాట్లాడుతున్న అవాజ్, ఎస్ఎఫ్ఐ కమిటీ నాయకులు

## సూపర్‌సిక్స్ పథకాలు వెంటనే అమలు చేయాలి



బుధవారపేటలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నాయకుడు నరసింహులు

**కర్నూలు(సెంట్రల్):** సూపర్ సిక్స్ పథకాలను సీఎం చంద్రబాబు నాయుడు వెంటనే అమలు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం23వ వార్డు శ్రీరామ్‌నగర్‌లో సీపీఎం నగర కార్యదర్శి ఆర్.నరసింహులు,, నాయకులు ఎస్. అజ్మత్, జాన్సన్, విజయభాస్కర్, రహిమాన్ ఆధ్వర్యంలో, బుధవారపేటలోని 14, 15, 16 వార్డుల పరిధిలో ఓల్డ్‌సిటీ నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్, నాయకులు ఎస్ఎండీ షరీఫ్, అబ్దుల్‌దేశాయ్, కె.రామకృష్ణ ప్రజా చైతన్య యాత్రలో పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఆయా వార్డుల్లో శిథిలమైన రోడ్లను బాగుచేయాలని, మురుగునీటి కాలువలను శుభ్రంచేయాలని డిమాండ్ చేశారు. శివారు కాలనీలకు మంచినీరు సరఫరా కావడంలేదన్నారు. డ్రెయినీజీలు పాడవడంతో రోడ్లపైనే మురుగునీరు పారుతోందన్నారు.

## ఈపీఎఫ్ పెన్షనర్లకు కనీస పింఛన్ రూ.9 వేలు ఇవ్వాలి

**కర్నూలు(సెంట్రల్):** ఈపీఎఫ్ పెన్షనర్లకు కనీస పింఛన్ రూ.9వేలు ఇవ్వాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ కమిటీ సభ్యుడు కె.సుధాకరప్ప, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు, బీఎస్ఎన్ఎల్ డీఓటీ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.యాకోబు, మద్దిలేటి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయా సంఘాల ఆధ్వర్యంలో కర్నూలులోని పీఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 196 రకాల పరిశ్రమల్లో పనిచేసి పదవి విరమణ చేసిన 78 లక్షల మంది పెన్షనర్లు ఉన్నారన్నారు. వీరందరి నుంచి 18 శాతం చొప్పు పీఎఫ్ వసూలు చేసి కార్పస్ ఫండ్ కింద జమ చేశారన్నారు. ఇందులో కనీస పింఛన్ రూ.9 వేలు ఇస్తే ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. ఇందుకోసం ఫిబ్రవరి 11, 12, 13 తేదీల్లో ఢిల్లీల్లో ఆందోళన చేపట్టినా కేంద్ర ప్రభుత్వం స్పందించపోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో నాయకుల నాగగోపాల్, రామనాగిరెడ్డి, సూర్యనారాయణ, చెన్నకేశవులు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



పీఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

### బీసీ, డీఎన్‌టీ వసతి గృహాలను పునః ప్రారంభించాలి

**కర్నూలు(సెంట్రల్):** కర్నూలు నగరంలోని బీసీ, డీఎన్‌టీ వసతి గృహాలను పునః ప్రారంభించాలని బహుజన విద్యార్థి వేదికవ్యవసాయ అధ్యక్షుడు వివి రమణ మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. బీక్యాంపులో ఉన్న ఈ రెండు వసతి గృహాల్లో 600 మందికిపైగా విద్యార్థులు చదువుకుంటూ ఉండేవారన్నారు. అ తే ఆయా వసతి గృహాల భవనాలు శిథిలావస్థకు చేరడంతో వాటిని మూసి వేశారన్నారు. ఈ క్రమంలో వాటికి సొంత భవనాలను ఏర్పాటు చేసి మళ్లీ ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

### 23న వెల్దుర్తి వెంకటనర్సు నాయుడు వర్ధంతి

**కర్నూలు కల్చరల్:** నట కిరీటి, రాయలసీమ రత్నం వెల్దుర్తి వెంకటనర్సు నాయుడు వర్ధతిని ఈనెల 23వ తేదీ సాయంత్రం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య తెలిపారు. కార్యక్రమాన్ని పురస్కరించుకొని శ్రీరామాంజనేయ యుద్ధం (వార్ సీను) నాటక ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. అనంతపురానికి చెందిన ధూపం తిరుమల తేజ.. శ్రీరాముడు, విజయనగరానికి చెందిన బొబ్బిలి నాయుడు.. ఆంజనేయ పాత్రలు పోషిస్తారని తెలిపారు. వెంకటనర్సు నాయుడు అభిమానులు, సాహితీ ప్రి యులు అందరూ హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

### పన్నులు చెల్లించకుంటే దుకాణాలు సీజ్

**కర్నూలు (టౌన్):** నగరపాలక సంస్థకు సంబంధించి ఆస్తి, నీటి పన్నులు, ట్రేడ్ లైసెన్సులు చెల్లించకుంటే దుకాణాలు, వ్యాపార సముదాయాలు సీజ్ చేస్తామని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ హెచ్చరించారు. మంగళవారం కల్లూరు ఏరియా చెన్నమ్మ సర్కిల్ సమీపంలోని శ్రీచక్ర హాస్పిటల్ యాజమాన్యం ఆస్తిపన్ను బకాయిలు రూ.6.58 లక్షలు చెల్లించడంలో జాప్యం చేస్తుందని మున్సిపల్ సిబ్బంది ప్లకార్డులు ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ.. పన్ను బకాయిదారులు త్వరితగతిన పన్నులు చెల్లించకపోతే ఏ నోటీసు జారీ చేయకుండా దుకాణాలను సీజ్ చేస్తామన్నారు. గృహాలకు కుళాయి కనెక్షన్లు తొలగిస్తామన్నారు. పన్ను వంద శాతం వసూలుకు యాక్షన్ ప్లాన్ రూపొందించామన్నారు. కార్యక్రమంలో ఆర్ ఓ జునీద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు శ్రీకాంత్, సచివాలయాల అడ్మిన్లు పాల్గొన్నారు.

**అదనపు కౌంటర్ ఏర్పాటు..**

నగరపాలక కార్యాలయంలో ఆస్తి పన్ను, నీటి పన్ను, ట్రేడ్ లైసెన్సు పన్నులు, బకాయిలు చెల్లించేందుకు తాకిడి ఎక్కువగా ఉండటంతో మరొక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు నగరపాలక మేనేజర్ చిన్నరాముడు తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోనే కాకుండా సచివాలయాలు, ఆన్‌లైన్‌లో సైతం పన్ను చెల్లించవచ్చన్నారు.

### రోస్టర్ పాయింట్లు ఎలా సాధ్యం

**కర్నూలు (అర్బన్):** ఎస్సీ వర్గీకరణకు సంబంధించి రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకుంటే రోస్టర్ పాయింట్లు ఎలా సాధ్యమో చెప్పాలని మాల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాసారపు వెంకటేష్ ప్రశ్నించారు. ఇప్పటికే ఎస్సీ కులాలకు చెందిన నిరుద్యోగులు వయసు మీద పడుతున్నా సంవత్సరాల తరబడి ప్రిపరేషన్‌లోనే ఉన్నారని మంగళవారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ కులాల వర్గీకరణ ఒక రాజకీయ అంశమని, ఈ అంశాన్ని మాల, మాదిగ ఉద్యోగులు అర్థం చేసుకోవడం లేదన్నారు. జిల్లా యూనిట్‌గా చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం నేడు రాష్ట్రం యూనిట్‌గా తీసుకుని ఎస్సీ కులాలను మోసం చేస్తోందన్నారు. రోస్టర్ పాయింట్లు 200 పెంచుతామని చెప్పడం ఎలా సాధ్యమన్నారు. నిరుద్యోగుల సమస్యలను కూడా రాజకీయ అంశంగా మార్చుకోవడం కూటమి ప్రభుత్వానికే చెల్లిందన్నారు. తప్పుల తడకగా ఉన్న రోస్టర్ పాయింట్లను మాదిగ మేధావులు కూడా గమనించాలన్నారు. ఈ అంశంపై హైకోర్టులో పిటిషన్ వేస్తామని తెలిపారు.

### మర్యాద పూర్వక కలయిక



బొకే ఇస్తున్న ఆర్‌డీఓ సందీప్‌కుమార్

**కర్నూలు (సెంట్రల్):** కర్నూలు వచ్చిన లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ సీనియర్ డిప్యూటీ డైరెక్టర్ డి.మహేష్ కుమార్‌ను అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, కర్నూలు ఆర్‌డీఓ సందీప్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో ఆయనకు స్వాగతం పలికి స్టేట్ గెస్ట్‌హౌస్‌లో విడిదిని ఏర్పాటు చేశారు. అనంతరం బొకేలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

### విజిబుల్ పోలీసింగ్‌ను బలోపేతం చేయండి

**కర్నూలు:** ప్రజల భద్రతకు భరోసా కల్పించేలా జిల్లా అంతటా విజిబుల్ పోలీసింగ్‌ను బలోపేతం చేయాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ క్షేత్రస్థాయి పోలీసు అధికారులను ఆదేశించారు. అనుమానితులను విచారించడం, వాహనాల తనిఖీలు చేపట్టి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యంగా సెల్‌ఫోన్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవింగ్‌లకు యువత దూరంగా ఉండేలా తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. రహదారి భద్రత నియమాల ఉల్లంఘనలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## ఎమ్మిగనూరు – కంబళదిన్నె రోడ్డు వేయండి

**కర్నూలు(అర్బన్):** ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లోని పలు గ్రామాలకు అనుసంధానంగా ఉన్న కంబళదిన్నె రోడ్డును బాగు చేయలని రాయలసీమ అభ్యుదయ విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఖాజా కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఆర్‌అండ్‌బీ డిప్యూటీ ఎస్ఈ వై సిద్ధారెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మిగనూరు నుంచి మాలపల్లి, కోసిగి మీదుగా కంబళదిన్నె వరకు రోడ్డు చాలా అధ్వానంగా తయారైందన్నారు. నిత్యం వేల సంఖ్యలో విద్యార్థులు, రైతులు, కూలీలకు వెళ్లే మహిళలు ఎమ్మిగనూరుకు వెళ్తుంటారన్నారు. 20 సంవత్సరాల క్రితం వేసిన ఈ రోడ్డుపై అడుగుకో గుంత ఉందన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఉరుకుంద లక్ష్మీనరసింహ స్వామి దర్శనానికి వెళ్లే భక్తులు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారన్నారు. గతంలో డబుల్ రోడ్డు మంజూరయ్యిందని, టెండర్లు రద్దు కావడం వల్ల ప్రస్తుతం సింగిల్ రోడ్ మంజూరు చేసే అవకాశం ఉందని డిప్యూటీ ఎస్ఈ తెలిపారన్నారు.

## క్షేమంగా.. రావమ్మా!



కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

**కర్నూలు(సెంట్రల్):** అంతరిక్ష కేంద్రం నుంచి నాసా హ్యోమగామి సునీతా విలియమ్స్ క్షేమంగా తిరిగి రావాలని కోరుకుంటూ నగరానికి చెందిన మాంటిస్సోరి విద్యార్థులు ఆకాంక్షించారు. ఈ మేరకు మంగళవారం ఉదయం కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట వారు ప్రార్థనలు చేశారు. బుధవారం ఆమె భూమి పైకి తిరిగి వస్తుండగా ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడాలని దేవుడిని ప్రార్థించారు. ఆమెతో పాటు ఉన్న వారంతా క్షేమంగా చేరుకోవాలని కోరుకున్నారు.

## వాహనం నిలిపితే రూ.వెయ్యి జరిమానా




కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఓపీ కౌంటర్ ఎదురుగా ఉన్న స్థలాన్ని నో పార్కింగ్ జోన్‌గా మార్చారు. ఇక్కడ వాహనాలు నిలిపితే రూ.1000 జరిమానా విధించనున్నట్లు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే ఈ ప్రాంతంలో ఇప్పటికీ కొంత మంది అధికారులు, వైద్యులు, ఉద్యోగులు వారి వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. వారిని వాహనాలు తీయాలని చెప్పే ధైర్యం సెక్యూరిటీ గార్డులు చేయలేకపోతున్నారు. మరోవైపు ఈ వాహనాలు చూపి ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులు వారి వాహనాలు ఇక్కడే పార్కింగ్ చేస్తామని సెక్యూరిటి గార్డులతో వాదనకు దిగుతున్నారు.

– కర్నూలు(హాస్పిటల్)

## క్లుప్తంగా

### వసూళ్లకు పాల్పడే గ్యాస్ ఏజెన్సీలను రద్దు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న ఏపీ మహిళా సమాఖ్య నాయకులు

**కర్నూలు(సెంట్రల్):** గ్యాస్ సిలిండర్లను డెలివరీకి డబ్బులు వసూలు చేసే ఏజెన్సీల లైసెన్స్‌లను రద్దు చేయాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గిడ్డమ్మ, శ్రావణి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఏపీ సమాఖ్య ఆధ్వర్యంలో డీఎస్ఓ కార్యాలయ సూపరింటెండెంట్ శివరంజనికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొన్ని ఏజెన్సీలు ఉచితంగా సిలిండర్ డెలివరీ చేయాల్సి ఉన్నా రూ.60 వరకు అక్రమంగా వసూలు చేస్తున్నాయన్నారు. వినియోగదారులు ఫిర్యాదులు చేస్తున్న అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు.

### వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

**కర్నూలు(హాస్పిటల్):** వేసవి తీవ్రత నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మాస్ మీడియా అధికారి(డెమో) శ్రీనివాసులు శెట్టి సూచించారు. మంగళవారం స్థానిక వడ్డేగేరిలోని యుపీహెచ్‌సీ పరిధిలో ఉన్న ఖడక్‌పురలో వడదెబ్బ నివారణ గురించి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. డెమో శ్రీనివాసులు శెట్టి మాట్లాడుతూ ప్రజలు ఉదయం 11 గంటల్లోపు తమ పనులు ముగించుకుని నీడగల ప్రదేశాల్లో ఉండాలని, తప్పనిసరిగా బయట ఎండలో వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ లేదా తలపై టవల్ పెట్టుకుని, కాళ్లకు చెప్పులు ధరించి వెళ్లాలన్నారు. వెంట నీళ్లబాటిల్ తీసుకుని గంట గంటకు నీళ్లు తాగాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్యకార్యకర్త పద్మావతి, ఆశా కార్యకర్తలు ఆషియా, సైనాజ్ పాల్గొన్నారు.

### ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మనోహర్‌రావు



**కర్నూలు(అర్బన్):** ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కర్నూలుకు చెందిన హెచ్‌కే మనోహర్‌రావు ఎన్నికయ్యారు. అనంతపురం జిల్లా కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి క్షేత్రంలో ఎన్నికలను నిర్వహించారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షులుగా గుంటూరుకు చెందిన కోనూరు సతీష్ శర్మ, కోశాధికారిగా పొన్నూరు ప్రసాద్ ఎన్నికయ్యారు. ఈ నియామకాలు రెండు సంవత్సరాలు అమలులో ఉంటాయని రాష్ట్ర అధికార ప్రతినిధి హెచ్‌కే రాజశేఖర్ రావు తెలిపారు. తమ మీద ఎంతో నమ్మకంతో ఎన్నుకున్నారని, ప్రభుత్వం ద్వారా బ్రాహ్మణులకు అందాల్సిన అన్ని పథకాలు అందేలా కృషి చేస్తామన్నారు.

### అన్నక్యాంటీన్ల తనిఖీ

**కర్నూలు (టౌన్):** నగరంలోని అన్న క్యాంటీన్లను మంగళవారం నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు తనిఖీ చేశారు. కలెక్టరేట్, పాతబస్టీలలోని అన్న క్యాంటీన్లను పరిశీలించి వినియోగదారులు, నిర్వాహకులతో కమిషనర్ మాట్లాడారు. అల్పాహారాన్ని పరిశీలించి, నాణ్యత విషయంలో రాజీ పడొద్దని సూచించారు. తప్పని సరిగా మెనూ పాటించాలన్నారు.

### రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటాలి



ఎంపిక పోటీల్లో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఎస్ డీవో భూపతిరావు

**కర్నూలు (టౌన్):** జిల్లా హాకీ జట్టు రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు అన్నారు. మంగళవారం స్థానిక ఎస్టీబీసీ కళాశాల క్రీడా మైదానంలో బాలుర జూనియర్ హాకీ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు సాధన చేస్తే ఏ క్రీడలోనైనా రాణించవచ్చన్నారు. జిల్లా హాకీ సంఘం కార్యదర్శి దాసరి సుధీర్ మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 6 నుంచి 9వ తేదీ వరకు సత్యసాయి జిల్లా ధర్మవరంలో నిర్వహించనున్న 15వ హాకీ ఆంధ్రప్రదేశ్ జూనియర్ హాకీ అంతర్ జిల్లా పోటీల్లో పాల్గొంటున్నారని చెప్పారు.

### హమాలీ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

**కర్నూలు(సెంట్రల్):** కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉన్న ఉల్లి, వాము పట్టుబడి హమాలీ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ నగర కమిటీ గౌరవాధ్యక్షుడు టి.రాముడు, అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.నరసింహులు, సీహెచ్ సాయిబాబా డిమాండ్ చేశారు. మంగళవారం కార్మిక, కర్షక భవన్‌లో వారు మాట్లాడుతూ.. సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి రూ.500 కోట్లు కేటాయించాలన్నారు.

### నేడు కేవీఆర్‌లో జాబ్ మేళా

**కర్నూలు కల్చరల్:** క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని మహిళా ప్రభుత్వ కళాశాలలో బుధవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీఎస్ కుమార్ తెలిపారు. కళాశాల జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో జాబ్ మేళా జరుగుతుందన్నారు. ఎలక్ట్రానిక్, మొబైల్ కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. పదో తరగతి, ఇంటర్, డిప్లొమా, ఐటీఐ, డిగ్రీ ఉత్తీర్ణత అయ్యి, 18 నుంచి 30 సంవత్సరాల వయసు లోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారు ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని జేకేసీ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్ఎం బాషా, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎస్‌జీ బాషా తెలిపారు.

### నేడు కర్నూలు నగరంలో విద్యుత్ కోతలు

**కర్నూలు(అగ్రికల్చర్):** నగరంలో ఈ నెల 19వ తేదీన మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని కర్నూలు టౌన్ డీఈఈ నాగప్రసాద్ తెలిపారు. కర్నూలు పాతబస్టాండు సమీపంలోని సాయిబాబా ఆలయం దగ్గర ఉన్న పోలీసు క్వాటర్స్ సబ్ పరిధిలో విద్యుత్ టవర్లను ఏర్పాటు చేస్తున్న దృష్ట్యా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. షరాఫ్ బజారు, బీఎస్ఎన్ఎల్ ఆఫీసు, పోస్టాఫీసు, కాంగ్రెస్ ఆఫీసు, దామోదరం సంజీవయ్య మున్సిపల్ హైస్కూలు, వడ్డేగేరి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు.

### పాలిసెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

**కర్నూలు (సెంట్రల్):** పాలిసెట్ –2025 నోటిఫికేషన్ విడుదలైందని, ఏప్రిల్ 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.చక్రవర్తి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఉంచాలని, లేదంటే మార్చి, ఏప్రిల్‌లలో పరీక్షలకు హాజరుకాబోవు విద్యార్థులందరూ అర్హులని పేర్కొన్నారు. ఓసీ, బీసీలు రూ.400, ఎస్సీ, ఎస్టీలు రూ.100 ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పాలిసెట్ పరీక్ష ఏప్రిల్ 30వ తేదీ ఉంటుందని, వివరాలకు https:// polycetap.nic.in/default.aspx వెబ్‌సైట్‌ను సందర్శించి తెలుసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 7382264325, 9494834320ను సంప్రదించాలని కోరారు.

### ఐదో అంతస్తు నుంచి పడి పెయింటర్ మృతి

**కర్నూలు:** కర్నూలు శివారు సుంకేసుల రోడ్డులోని బాలాజీ నగర్ వద్ద ఓ భవనం ఐదవ అంతస్తు గోడపై నుంచి అదుపు తప్పి పెయింటర్ సురేంద్రనాథ్ (45) కింద పడి మృతి చెందాడు. కల్లూరు మండలం వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన సురేంద్రనాథ్ మంగళవారం ఉదయం పెయింటింగ్ పనికెళ్లాడు. మధ్యాహ్నం గోడపై నుంచి అదుపు తప్పి కింద పడి మృతి చెందాడు. విషయం తెలిసి కర్నూలు అర్బన్ తాలూకా ఎస్ఐ పీరయ్య సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. అయితే భవనం కాంట్రాక్టర్ అందుబాటులో లేకపోవడంతో ఫిర్యాదు చేయడానికి బాధిత కుటుంబ సభ్యులు ముందుకు రాలేదని పోలీసులు తెలిపారు.